సాక్షి
వరంగల్
మంగళవారం । 5 । నవంబర్ । 2024



పరిహారం కోసం ఆందోళన

నకిలీ పురుగుల మందు పిచికారీ చేయడంతో చేతికందిన మిరపతోట ఎండిపోయిందని, తనకు నష్టపరిహారం అందించాలని ఓ రైతు ఆందోళన చేశారు. - 8లో▸



వనభోజనం..పుణ్యఫలం

కార్తీకమాసం.. శివ, కేశవులు ఇద్దరిని పూజించే పవిత్ర మాసం. ఈ మాసంలో వన భోజనాలకు వెళ్తే పుణ్యఫలం లభిస్తుందని భక్తుల నమ్మకం. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32^0 /20^0

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఉంటుంది.

పత్తికి తేమ తంటా..

- ధర తగ్గడంపై రైతుల ఆవేదన
- చేతులెత్తేసిన ప్రభుత్వ యంత్రాంగం
- ప్రేక్షక పాత్రలో మార్కెటింగ్ అధికారులు



ఏనుమాముల మార్కెట్‌కు రైతులు అమ్మకానికి వాహనాల్లో తెచ్చిన పత్తి

వరంగల్: ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకొని పంట పండించిన అన్నదాతలకు ఏటా నష్టాలే మిగులుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం పత్తికి కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) ప్రకటించినా తేమ శాతం నిర్దేశించడంతో రైతులు దిగాలు పడిపోతున్నారు. మద్దతు ధరతో పంటలు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ప్రకటనలిస్తున్నారే తప్ప సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కష్టాలతోనే ఖరీఫ్..

ఈ ఏడాది ఖరీఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో కష్టాలతోనే సాగింది. ప్రారంభంలో వర్షాభావం నెలకొనడంతో విత్తన స్థాయిలోనే పెట్టుబడులు ఎక్కువయ్యాయి. దీంతోపాటు అనుకూలించని వాతావరణం దిగుబడులపై ప్రభావం చూపింది. వచ్చిన కాస్త దిగుబడులకు గిట్టుబాటు ధర దక్కుతుందా.. అంటే అదీ లేదు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో పత్తికి మద్దతు ధర ఆశించిన మేరకు ఉన్నప్పటికీ తేమ శాతంతో తక్కువ ధరకు అమ్ముకోక తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. పత్తిలో తేమ 8 నుంచి 12 శాతం ఉంటేనే కొనుగోలు చేస్తామని సీసీఐ అధికారులు, అంతకంటే ఎక్కువ తేమ ఉన్న పత్తికి వ్యాపారులు ఇష్టం వచ్చిన ధర చెల్లిస్తుండడంతో జిల్లా యంత్రాంగం, మార్కెటింగ్‌శాఖ అధికారులు



జెండాపాట నిర్వహిస్తున్న అడ్తిదారు

ప్రేక్షకపాత్ర వహించక తప్పడం లేదు.

నిబంధనలతో చిక్కు..

మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నా సీసీఐ నిబంధనలు పత్తి అమ్మకాలకు చిక్కులు తెచ్చి పెడుతున్నాయి. ప్రధానంగా పత్తిలో తేమ శాతాన్ని బట్టి సీసీఐ ధర నిర్ణయిస్తుంది. నిబంధనల ప్రకారం తేమ 8 నుంచి 12శాతం ఉంటేనే ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని సీసీఐ అంటోంది. తేమ శాతం పెరిగిన కొద్దీ ధర తగ్గుతుంది. ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న పత్తిలో 12 నుంచి 20 శాతం, అంతకంటే ఎక్కువే తేమ ఉంటోంది. ఈ నేపథ్యంలో మద్దతు ధర లభించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రైతులు మద్దతు ధర కావాలని పలుమార్లు డిమాండ్ చేస్తున్నా.. నిబంధనలు ఒప్పుకోవని సీసీఐ అధికారులు పేర్కొంటున్నారు. నిబంధనలను కొంతమేరకు సడలించి సీసీఐ పత్తిని కొనుగోళ్లు చేయకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని రైతు సంఘాలు తెలుపుతున్నాయి.

ధర తక్కువగా చెల్లిస్తున్నారు..



మార్కెట్‌కు 17 బస్తాల పత్తి తెచ్చిన. జెండా పాటలో క్వింటాకు రూ.6910 ధర నిర్ణయించి చెల్లించారు. తేమ ఎక్కువగా ఉన్నదని వ్యాపారులు తక్కువ ధర ఇస్తున్నారు. పెట్టుబడి అప్పులు తీర్చడానికి మార్కెట్‌కు తెచ్చిన పత్తిని వ్యాపారులు చెప్పిన ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది. .

- అదరు భిక్షపతి, దామెర(ఎల్కతుర్తి)

దిగుబడి తగ్గింది..



మార్కెట్‌కు 29 బస్తాల పత్తి తీసుకువచ్చాను. పంట సాగు పెట్టుబడి పెరిగింది. అకాల వర్షాలతో దిగుబడి తగ్గింది. ఎకరాకు 7 క్వింటాళ్ల కంటే ఎక్కువ దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికే కొంత మంది రైతులు పత్తి ఏరిన తర్వాత తొలగించి మొక్కజొన్న వేసేందుకు సిద్ధమవుతున్నారు.

- సంజీవరెడ్డి, ఇస్సీపేట(మొగుళ్లపల్లి)

గరిష్ట ధర లభించేలా పర్యవేక్షిస్తున్నాం..



ప్రస్తుతం మార్కెట్‌కు వచ్చే పత్తిలో తేమ శాతం ఎక్కువ ఉంటోంది. దీంతో సీసీఐ నిబంధనల మేరకు ఉన్న పత్తిని కొనుగోలు చేస్తోంది. తేమ ఎక్కువ శాతం ఉన్న పత్తిని వ్యాపారులే కొనుగోలు చేస్తున్నారు. సోమవారం ఏనుమాముల మార్కెట్ పరిధి సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో కనీస మద్దతు ధరలతో సుమారు వెయ్యి క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసింది. సీసీఐ కేంద్రాలను మినహాయిస్తే మార్కెట్‌కు వచ్చిన పత్తిలో 12 నుంచి 20శాతం వరకు తేమ ఉంటున్నది. ఈరోజు జెండా పాటలో క్వింటా పత్తికి గరిష్ట ధర రూ.6910, కనిష్టంగా రూ.5500 ధరతో వ్యాపారులు కొనుగోలు చేశారు. యార్డుల్లో పత్తి రైతులకు గరిష్ట ధరలు లభించే విధంగా పర్యవేక్షిస్తున్నాం.

- పి.నిర్మల, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



సంగెంలో సర్వే సిబ్బందికి సూచనలిస్తున్న రాంరెడ్డి



దుగ్గొండిలో మాట్లాడుతున్న సంగీతలక్ష్మి

- జెడ్పీ సీఈఓ రాంరెడ్డి

సంగెం: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ రాంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎన్యుమరేటర్లకు సామాజిక, ఆర్థిక, కుల, ఉపాధి, రాజకీయ సర్వేపై సోమవారం శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపటి నుంచి 18వ తేదీ వరకు సర్వేలో పాల్గొనే సిబ్బంది ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే చేపట్టాలన్నారు. సర్వే చేసే ప్రాంతాల్లో ఒక రోజు ముందుగానే సమాచారం అందించి అవసరమైన పత్రాలు అందుబాటులో ఉంచుకునేలా అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. దీంతో ఎన్యుమరేటర్లకు సర్వే నిర్దేశిత సమయంలో పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. లబ్ధిదారులు చెప్పిన సమాచారాన్ని తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి గోవిందరాజన్, డీఎల్‌పీఓ వేదవతి, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ కొమురయ్య, ఏఓ యాకయ్య, పీఆర్, ఐబీ ఏఈలు రమేష్‌కుమార్, రాజు, ఏపీఎం కిషన్ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండిలో శిక్షణ శిబిరం

దుగ్గొండి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, కుల గణనను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి సంగీతలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ఉపాధ్యాయులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఇంటికి వెళ్లి వివిధ రకాల ప్రశ్నలకు సమాధానాలు రాబట్టి నమోదు చేయాలన్నారు. ప్రతీ టీచర్ తనకు కేటాయించిన 150గృహాలలో గణన పూర్తి చేయాలన్నారు. సర్వే సమయంలో ప్రతీ ఇంటి యజమాని లేదా కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ఒకరు అందుబాటులో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అరుంధతి, ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, మండల వ్యవసాయ అధికారి మాధవి, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఏఎస్ఓ పవన్‌కుమార్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్తీక శోభ

కార్తీక మాసం ప్రథమ సోమవారాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో ఇష్టదైవాలను దర్శించుకున్నారు. రుద్రేశ్వరాలయంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు సాయంత్రం కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వరంగల్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత కార్తీక దీపోత్సవాన్ని ప్రారంభించారు.

- హన్మకొండ కల్చరల్



రుద్రేశ్వరుడి సన్నిధిలో భక్తజనం

న్యూస్‌రీల్

అవెన్యూ ప్లాంటేషన్‌కు సిద్ధం కావాలి



గీసుకొండ: అవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటుకు అధికారులు సిద్ధం కావాలని డీఎఫ్ఓ అంజు అగర్వాల్ అన్నారు. మండల పరిధిలోని మచ్చాపూర్ నుంచి దుగ్గొండి మండలం లక్ష్మిపురం వరకు ఇటీవల వేసిన బీటి రోడ్డుకు ఇరువైపులా 10 కిలోమీటర్లు అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలను నాటి పెంచుతున్నారు. ఈ మేరకు ఆయన సోమవారం సందర్శించి మొక్కలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా నీడను, పండ్లు ఇచ్చే మొక్కలను నాటాలన్నారు. కిలోమీటరుకు రోడ్డుకు ఇరువైపులా 200 మొ క్కలు నాటాలన్నారు. రావి,మర్రి,మేడి, జువ్వి, నేరేడు ఇతర రకాల మొక్కలను సిద్దిపేట జిల్లా నుంచి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేంజర్ సందీప్, ఎఫ్ఎస్ఓ జగ్గయ్య నాయక్, బీట్ ఆఫీసర్ సమ్మయ్య, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత



వర్ధన్నపేట: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. మండల పరిధిలోని ఇల్లంద శివారులో ఆకేరువాగు ఒడ్డున ఉన్న శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయాన్ని తొలి కార్తీక మాస సోమవారం సారయ్య దంపతులు సందర్శించారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం వారికి అర్చకులు స్వామివారి శేష వస్త్రాలు, అమ్మవారి చీర జాకెటు ప్రసాదం అందజేసి వేద పండితులు ఆశీర్వదించారు.

8న జాబ్‌మేళా

కాశీబుగ్గ సెంటర్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులకు ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 8న ములుగు రోడ్డు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సీహెచ్.ఉమారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి సమాచారం తెలుసుకోవడానికి సెల్ నంబర్ 7093168464లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల యువతీయువకులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లతో ఉదయం 10.30గంటలకు హాజరుకావాలని సూచించారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల బదిలీ

నెక్కొండ: ఓ ఫిర్యాదు దారుడి వద్ద తీసుకున్న లంచం డబ్బుల పంపిణీ విషయంలో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్న ఇద్దరు కానిస్టేబుళ్లను సీపీ అంబర్ కిశోర్ ఝా సోమవారం బదిలీ చేసినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళ్తే.. నెక్కొండ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుళ్లు సోమ్లానాయక్, మోహన్ నాయక్ విధులు నిర్వర్తిస్తున్నారు. గత నెల 29న మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఫిర్యాదు దారుడి దగ్గర తీసుకున్న లంచం పంపకాల్లో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సమయంలో ఎస్సై మహేందర్ అందుబాటులో లేక పోవడంతో సీఐ చంద్రమోహన్ ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు శాఖాపరమైన చర్యల్లో భాగంగా సోమ్లానాయక్‌ను ఎల్కతుర్తికి, మోహన్‌నాయక్‌ను ధర్మసాగర్‌కు బదిలీ చేసినట్లు సమాచారం.

ఆల్ ఇండియా పోటీలకు కేయూ జట్టు

కేయూ క్యాంపస్: ఈనెల 6 నుంచి 9 వరకు అమృత్‌సర్‌లోని గురునానక్ యూనివర్సిటీలో నిర్వహించనున్న ఆల్‌ఇండియా జోన్ ఇంటర్ యూనివర్సిటీ తైక్వాండో పురుషుల టోర్నమెంట్‌కు కేయూ జట్టును ఎంపిక చేసినట్లు సోమవారం స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ వెంకయ్య తెలిపారు. ఈజట్టులో టి.నవీన్, ఎం.రాజేశ్ (హనుమకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల), టి.మోహన్‌కృష్ణ (వాగ్దేవి డిగ్రీ కాలేజీ, హనుమకొండ), కె.కిరణ్ (నలంద డిగ్రీ కాలేజీ, మహబూబాబాద్) కె.అఖిలేష్ (సమాఖ్య డిగ్రీ కాలేజీ, మహబూబాబాద్) ఉన్నట్లు వెంకయ్య తెలిపారు. ఈజట్టుకు మహబూబాబాద్‌లోని నలంద డిగ్రీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ కె.రమేశ్ కోచ్ అండ్ మేనేజర్‌గా వ్యవహరించనున్నట్లు ఆయన తెలిపారు.

రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట/నెక్కొండ: రాష్ట్ర ప్రభుత్వం రైతును రాజు చేయడమే లక్ష్యంగా కృషి చేస్తుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు నర్సంపేట మార్కెట్ యార్డు సీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించే పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పట్టణంలోని ఉమామహేశ్వర మిల్లులో కలెక్టర్ సత్యశారదతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ రైతుల బాగు కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. రైతులు పంటలను మార్కెట్‌కు తెచ్చే సమయంలో ఆరబెట్టి తేవడం వల్ల ఎక్కువ ధర లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నెక్కొండ మండల కేంద్రంలోని భవాని కాటన్ ఇండస్ట్రీస్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఏఎంసీల పరిధిలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. గత పదేళ్లలో సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో లోపాలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. ఇప్పుడు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు, మార్కెట్ పాలక వర్గం, వ్యాపారులు రైతులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఎడ్ల నరేశ్‌రెడ్డి, జేడీఎం శ్రీనివాస్, డీడీఎం పద్మావతి, డీఎంఓ సురేఖ, సీసీఐ ఇన్‌చార్జ్ సుశీల్‌కుమార్, మార్కెట్ కార్యదర్శి కృష్ణమీనన్, పీఏసీఎస్ చైర్మన్ ఘంటా దామోదర్‌రెడ్డి, తహసీల్దార్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట/పర్వతగిరి: గ్రామాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరిస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మండల పరిధిలోని చెన్నారం గ్రామంలో ఏసెస్ బాప్టిస్ట్ ఆధ్వర్యంలో ప్రగతి సేవా సమితి సహకారంతో గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అదే విధంగా వాటర్ ప్లాంట్‌కు కావాల్సిన బోరుబావి తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేస్తానని తెలిపారు. గ్రామంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందే విధంగా కృషి చేస్తానని తెలిపారు. గ్రామస్తుల కోరిక మేరకు బాప్టిస్ట్ చర్చి భవన నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన బర్ల లచ్చమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాప సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, నాయకులు పోశాల వెంకన్న, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం పర్వతగిరి మండల కేంద్రంతో పాటు కల్లెడలో ఐకేపీ, ముంజాలకుంటతండాలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే నాగరాజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. అలాగే సన్న ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్‌గౌడ్, ఏపీఎం కృష్ణమూర్తి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు తొర్రి పద్మ, ముదురుకోళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మండల కేంద్రానికి చెందిన మునిగే మీనాక్షి ఇటీవల ఎంబీబీఎస్ సీటు సాధించగా ఎమ్మెల్యే నాగరాజు స్వయంగా వారి ఇంటికి వెళ్లి వైద్య, విద్య పరికరాలను అందించారు. అనంతరం ఆమె తల్లిదండ్రులు సునీతచంద్రశేఖర్‌లను శాలువాతో సన్మానించి అభినందించి ఆర్థిక సాయం చేశారు. అనంతరం మీనాక్షితో కలిసి ఎమ్మెల్యే నాగరాజు వారి ఇంట్లో భోజనం చేశారు.

నేడు ఉమ్మడి జిల్లా కళాకారుల సదస్సు

న్యూశాయంపేట: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నేడు (మంగళవారం)ఉమ్మడి వరంగల్ జిల్లా కళాకారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫోరం బాధ్యులు జి.కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేటర్ వరంగల్ పరిధి మడికొండ రాజశ్రీ గార్డెన్‌లో ఉదయం 9గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్యశారద



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యశారద, అధికారులు



ప్రజావాణి వినతులు రాస్తున్న హెల్ప్‌డెస్క్ ప్రతినిధులు

కాశీబుగ్గ సెంటర్: ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు అందించిన దరఖాస్తులను పెండింగ్ పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ మాడభూషి విజయలక్ష్మితో కలిసి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా 87వినతులు రాగా అందులో 34రెవెన్యూ శాఖకు సంబంధించినవిగా ఉన్నాయి. అలాగే కలెక్టరేట్‌కు సంబంధించినవి 10, డీఆర్‌డీఓకు చెందినవి 8, జీడబ్ల్యూఎంసీకి చెందినవి 9 కాగా మిగితావి వివిధ శాఖలకు సంబంధించినవి ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన వినతులను పెండింగ్‌లో పెట్టకుండా వారం రోజుల వ్యవధిలో పరిష్కరించాలన్నారు. పరిష్కారం కానివి ఎందుకు పరిష్కరించలేదో కారణాలను దరఖాస్తు దారుడికి వివరించాలని తెలిపారు.

కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్

ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవడానికి నిరక్ష్యరాస్యులు ఒక దరఖాస్తుకు రూ.100 ఖర్చు చేస్తున్నట్లు కలెక్టర్ సత్యశారద దృష్టికి రావడంతో వయోవృద్ధుల సంక్షేమ సంస్థ బాధ్యులతో మాట్లాడారు. ప్రజావాణికి దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే నిరక్ష్యరాస్యుల దరఖాస్తులను ఉచితంగా రాసి ఇచ్చే విధంగా సేవచేయడానికి హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు వయోవృద్ధుల సంక్షేమ సంస్థ బాధ్యులు ప్రజలకు సంబంధించిన విషయాన్ని విని ఉచితంగా దరఖాస్తులను రాసి వారికి అందజేస్తున్నారు.

ఈ హెల్ప్ డెస్క్‌లో సంస్థ అధ్యక్షుడు మల్లారెడ్డి, కార్యదర్శి ఎన్.సదానందం, ఉపాధ్యక్షులు గోవర్ధన్, సహాయ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి డబ్బులు రాలేదు..



మా చెల్లె కల్యాణికి 18 మార్చి 2023లో పెళ్లి జరిగింది. కల్యాణలక్ష్మి పథకానికి ఖిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలోని మీసేవలో దరఖాస్తు చేసినాము. మా చెల్లె కంటే వెనుక పెళ్లి చేసిన వాళ్లకు కల్యాణి లక్ష్మి పథకం డబ్బులు వచ్చాయి. మాకు మాత్రం రావడం లేదు. 2023 డిసెంబర్‌లో తహసీల్దార్ కార్యాలయంలో డబ్బులు రాలేదని ఫిర్యాదు చేశాము. ఎవరూ పట్టించుకోలేదు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకురావడానికి గ్రీవెన్స్‌లో దరఖాస్తు అందజేశాము.

- కొమ్మరాజుల సందీప్, కరీమాబాద్, వరంగల్

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి



జీవో నంబర్ 58 కింద ప్రభుత్వ స్థలం కేటాయించి ఇందరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నాను. ఎంక్వైరీ చేసి పట్టా ఇస్తానన్నారు. నాకు ముగ్గురు కూతుళ్లు ఉండగా ఇద్దరి పెళ్లిల్లు అయ్యాయి. మరో కూతురు ఆరోగ్యం బాగోలేకపోవడంతో నా దగ్గరే ఉంటుంది. జీవో 58కింద పట్టా మంజూరు చేసి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వేడుకుంటున్నాను.

- సుల్తానరమా, చింతలపెల్లి

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



వరంగల్ స్పోర్ట్స్: ఉత్తరప్రదేశ్‌లో ఈనెల 6 నుంచి నిర్వహించే ఎస్‌జీఎఫ్ అండర్ -17 జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు హనుమకొండ డీఎస్ఏ క్రీడాకారుడు బర్ల సన్నీ ఎంపికైనట్లు కోచ్ బత్తిని జీవన్‌గౌడ్ తెలిపారు. హనుమకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సన్నీ ఇటీవల గోదావరిఖనిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వరంగల్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి తృతీయ స్థానం సాధించడంలో ముఖ్య భూమిక పోషించి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. జీవన్‌గౌడ్ వద్ద శిక్షణ పొందుతున్న సన్నీని హనుమకొండ డీవైఎస్ఓ గుగులోతు అశోక్ కుమార్ సోమవారం అభినందించారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు షురూ

కేయూ క్యాంపస్: కేయూలో ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్స్, కామర్స్, ఇంజనీరింగ్, లా విభాగాల్లో పీహెచ్‌డీ పరిశోధకులకు సోమవారం ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. వివిధ కేంద్రాల్లో పరీక్షల తీరు తెన్నులను కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి పరిశీలించారు.

ఎంపీటీ చట్టంపై అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్ఓ అప్పయ్య



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ అప్పయ్య

ఎంజీఎం : లింగ నిర్ధారణ, బాలికల పట్ల వివక్ష, ఎంపీటీ చట్టంపై ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని హనుమకొండ డీఎంహెచ్ఓ అప్పయ్య సూచించారు. సోమవారం తన కార్యాలయంలో గర్భస్థ పూర్వ, పిండ లింగ నిర్ధారణ చట్టంపై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణులు వైద్య పరీక్షలు, లింగ నిర్ధారణ, అబార్షన్ కోసం అర్హత లేని వైద్యుల వద్దకు వెళ్లి ప్రాణాలకు ప్రమాదం కొని తెచ్చుకోవద్దని సూచించారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు చట్ట నియమాలకు లోబడి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జీఎంహెచ్ ప్రొఫెసర్, గైనకాలజిస్ట్ డాక్టర్ రాజేశ్వరి, అడిషనల్ డీఎంహెచ్ఓ మదన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయ్‌కుమార్, పీఓఎంహెచ్ఎన్ నాగరాజు, కవిత, సోషల్ యాక్టివిస్ట్ రేవతీదేవి, మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, ఎస్ఓ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

వైద్యులు సేవాభావంతో సేవలందించాలి

జిల్లాలో వైద్యులు, వైద్య సిబ్బంది సేవాభావంతో ప్రజలకు సేవలందించాలని డీఎంహెచ్ఓ అప్పయ్య సూచించారు. పీహెచ్‌సీలు, పల్లె దవాఖానా, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ.. పీహెచ్‌సీలకు వచ్చే ప్రజలతో వైద్యులు, సిబ్బంది సమస్యలు తెలుసుకుని అవసరమైన చికిత్స అందించాలని సూచించారు.

సన్మానంపై వివరణ ఇవ్వాలి

కాశీబుగ్గ సెంటర్: వరంగల్ జిల్లా విద్యాశాఖ కార్యాలయ అధికారుల చాంబర్‌లో గత నెల 30న సంబంధం లేని ఓ వ్యక్తికి సన్మానం చేసినట్లు సమాచారం. ఈ విషయం గురించి మూడు రోజులలో వివరణ ఇవ్వాలని డీఈఓ జ్ఞానేశ్వర్‌కు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఈవీ.నరసింహారెడ్డి ఆదేశించారు. ఈ మేరకు వివరణ ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

క్లుప్తంగా

ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



రామన్నపేట : 2023–24 సంవత్సరానికి సంబంధించి ఎన్‌సీసీలో 'సీ' సర్టిఫికెట్ పొందిన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ కళాశాల విద్యార్థులకు నగరంలోని ఎల్‌బీ కళాశాలలో పదో తెలంగాణ బెటాలియన్ ఆర్మీవింగ్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్ఎస్ రామదురై చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్ సోమవారం తెలిపారు. దేశ సేవకు యువత ముందుకు రావాలని, ఎన్‌సీసీ ద్వారా భారత ఆర్మీలో ప్రవేశాలు పొందొచ్చన్నారు. ఎన్‌సీసీలో చేరడం ద్వారా భవిష్యత్‌లో క్రమశిక్షణ కలిగిన పౌరులుగా తయారవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కెప్టెన్ సదానందం, సుబేదార్ సౌరస్య, జూనియర్ కమిషనర్ ఆఫీసర్ రఫీ, పాషా, నికేశ్, ప్రవీణ్, దినేశ్, దీపక్, తదితరులు పాల్గొన్నారు.

కంచర్లగూడెం తండాలో చోరీ

కురవి: మండలంలోని కంచర్లగూడెం తండాలో చోరీ జరిగింది. ఈ ఘటనలో 9 తులాల బంగారం, 40 తులాల వెండి ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. బాధితుడి కథనం ప్రకారం.. తండాకు చెందిన తేజావత్ కిషన్ సోమవారం ఇంటికి తాళం వేసి పని నిమిత్తం వేరే గ్రామానికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తాళం తీసి ఉంది. అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూడగా 9 తులాల బంగారు, 40 తులాల వెండి ఆభరణాలు, రూ.90వేల నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని భావించిన కిషన్ వెంటనే డయల్ 100కు కాల్ చేశాడు. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు.

బైక్‌ను ఢీకొన్న బొలెరో..

- ఆర్‌ఎంపీ దుర్మరణం

రఘునాథపల్లి: మండలంలోని బానాజీపేట– శ్రీమన్నారాయణపురం రహదారిపై బైక్‌ను బొలెరో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆర్‌ఎంపీ దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం ..జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం బానాజీపేటకు చెందిన రచ్చ శ్రీహరి(56) గ్రామంలో ఆర్‌ఎంపీగా పని చేస్తున్నాడు. పని నిమిత్తం సోమవారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై జనగామకు బయలుదేరాడు. ఈ క్రమంలో కల్వలపల్లి సమీపంలోని మలుపు వద్దకు రాగానే శ్రీమన్నారాయణపుం మీదుగా కూలీలతో ఎదురుగా వచ్చిన బొలెరో.. బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న శ్రీహరి ఎగిరి రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందాడు. మృతుడికి భార్య సుశీల, ఇద్దరు కుమారులు వెంకటేశ్, గణేశ్, కూతురు మాధవి ఉన్నారు. దశాబ్దాలుగా ఆర్‌ఎంపీగా వైద్య సేవలందిస్తున్న శ్రీహరి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై మృతుడి పెద్ద కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.



శ్రీహరి(ఫైల్)

వనభోజనం.. పుణ్యఫలం



ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు



వనభోజనాలు చేస్తున్న కుటుంబాలు

కార్తీక మాసంలో వెళ్తే మంచి జరుగుతుందని నమ్మకం

- అనాదిగా వస్తున్న సంప్రదాయం
- ఆధునిక యుగంలోనూ కొనసాగింపు..
- కుల సంఘాల సమ్మేళనంగా మార్పు

కాజీపేట : కార్తీక మాసం.. శివ, కేశవులు ఇద్దరిని పూజించే పవిత్ర మాసం. ఈ మాసంలో పూజలకు ఎంత ప్రాధాన్యం ఉందో వనభోజనాలకు అంతే ప్రాధాన్యం ఉంటుంది. ఈ కాలంలో దేవతలు వనాల్లో విహరిస్తూ చెట్లపై కొలువుదీరుతారని హిందువుల నమ్మకం. కార్తీక మాసంలో ఉసిరి చెట్టును శ్రీమహావిష్ణువుగా భావిస్తారు. ఈ చెట్టు కింద భోజనం చేస్తే పుణ్యఫలం లభిస్తుందని నమ్ముతారు. అనాదిగా కొనసాగుతున్న సంప్రదాయం ఇది. ఎన్నో ఔషధ గుణాలున్న ఉసిరి చెట్టు కింద సామూహిక వనభోజనాలు చేస్తే పుణ్య ఫలం దక్కుతుందని పురాణేతిహాసాలు పేర్కొంటున్నాయి. మహర్షులు కూడా దీనిని ఆచరించినట్లు చెబుతారు. నేడు అంతటి విశిష్టత లేకపోయినా సంప్రదాయం ఏదో ఒక రూపంలో కొనసాగుతూనే ఉంది. అడవులు అంతరించి పోతున్న ఈ రోజుల్లో ఉసిరి చెట్టుకు కొరత ఉండడంతో ఏదో ఒక చెట్టు కింద సంప్రదాయాన్ని పూర్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సమైఖ్యతకు చిహ్నంగా చెప్పుకునే వనభోజనాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఉసిరి చెట్టే కాదు..అన్నీ వేదికలే

కార్తీక మాసంలో ఒక్కరోజైనా ఉసిరి చెట్టు కింద భోజనం చేస్తే దేవుడి అనుగ్రహం లభిస్తుందని ఆధ్యాత్మికవాదుల విశ్వాసం. అంత మాత్రన ఉసిరి చెట్టు లేకపోతే ఫలితం ఉండనవసరం లేదని వారు పేర్కొంటున్నారు. ఎవరి అభీష్టం మేరకు వారు తమకు నచ్చిన ప్రదేశాన్ని ఎంచుకుని వనభోజనాలు పూర్తి చేయొచ్చంటున్నారు. కొందరు ఉద్యానవనాల్లో పిక్నిక్‌లకు ప్రాధాన్యం ఇస్తారు. మరి కొందరు నదులు, సముద్ర తీరాల్లో జరుపుకుంటారు. తోటలు అందుబాటులో ఉన్న ప్రాంతాల వారు ఆయా ప్రదేశాల్లో పిక్నిక్‌లు జరుపుకుంటారు.

వారాంతపు రోజులకు భిన్నం..

వనభోజన కార్యక్రమాలకు కూడా వారాంతపు రోజుల్లోనే నిర్వహించుకున్నప్పటికీ సాధారణంగా వీకెండుకు ఇది భిన్నమని గుర్తించాలి. వీకెండ్‌లో సాధారణంగా కలిసే మిత్రులు, ఉద్యోగులు కార్తీక మాసంలో వనభోజనాలకు వెళ్తుంటారు. ఇందు కోసం దూర ప్రాంతాలను ఎంచుకుంటారు. ఏడాది మొత్తం ఎక్కడెక్కడ ఉన్నా ఏటా వనభోజనాలకు అందరూ ఒక్కచోటుకు రావడం కొంత మంది అలవాటుగా మార్చుకున్నారు.

కుల సంఘాల జోరు..

సామూహిక వనభోజనాల్లో కుల సంఘాల జోరు కొనసాగుతోంది. కులాల వారీగా విడిపోయి వన భోజనాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆయా వన భోజనాలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగుతున్నాయి.

ముందస్తు ప్రణాళిక అవసరం..

వనభోజనాల్లో రోజంతా ఆనందోత్సాహాలతో గడిపి మధురానుభూతిని సొంతం చేసుకోవాలంటే ముందస్తు ప్రణాళిక తప్పనిసరి. ఎంతమంది వెళ్తున్నారో పక్కాగా నిర్ణయించుకుని అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేసుకోవాలి. ఉదయం వేగంగా వెళ్తే ఎక్కువ సేపు గడిపామనే ఆనందం కలుగుతుంది. నీడనిచ్చే ప్రాంతాలను ఎంపిక చేసుకోవాలి.

ఆధ్యాత్మిక చింతనతో..

వనభోజనాలు ఆధ్యాత్మిక చింతనతోపాటు హైందవ ధర్మాన్ని చాటి చెబుతాయి. వనసమారాధన వల్ల ఆయుర్వేదంలో వృక్ష జాతికున్న విశిష్టత అందరికీ తెలుస్తుంది. ఆహారాన్ని మహావిష్ణువుకు ప్రీతి అయిన ఉసిరి చెట్టు కింద తింటే ప్రతిఫలం ఉంటుంది. ఈ కారణంతోనే సామూహిక వనభోజనాలు చేసే వారు ఇప్పటికీ ఉన్నారు. ప్రధానంగా దైవభక్తి, గ్రామీణ నేపథ్యం ఉన్న వారు ఇలాంటి సంప్రదాయాలను పాటిస్తున్నారు.

పెళ్లి చూపుల వేదికగా..

వనభోజనాలు పెళ్లి చూపులకు వేదికలుగా మారిపోయాయి. తమ పిల్లలకు మంచి సంబంధాలు వెతకాలంటే వనభోజనాలకు హాజరై ఇరు కుటుంబాల వారు మాట, మంచి పంచుకుంటున్నారు. ప్రధానంగా పెళ్లి సంబంధాలు చూసే కుటుంబాలు తప్పకుండా వనభోజనాలకు హాజరవుతున్నారు. ఆయా కుటుంబాలు కలిసి మాట్లాడుకోవడం, ఒకరినొక్కరు చూసుకోవడం వనభోజనాల్లోనే జరిగిపోతున్నాయి. నచ్చితే ఆ తర్వాత కొనసాగింపు ఉంటుంది.

పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలి..

పిల్లలతో వనభోజనాలకు వెళ్తే అప్రమత్తంగా ఉండాలి. ఎందుకంటే వారికి ఏమైనా జరిగితే అప్‌సెట్ అవుతాం. వారు స్వేచ్ఛగా ఆడుకునే అవకాశం ఇస్తూనే కనిపెడుతూ ఉండాలి. జలాశయాలు, సాగరం తీరం వద్ద వనభోజనాలు ఏర్పాటు చేస్తే అప్రమత్తంగా ఉండాలి. జలపాతాల వద్ద ఆటలు వద్దు. పిల్లలను ఎట్టి పరిస్థితుల్లో ఒంటరిగా వదిలేయ్యొద్దు. వెంట ఎవరో ఒకరు ఉండాలి.

కార్తీకంలో వనభోజనాలు పుణ్యం..



కార్తీక మాసంలో శివ, కేశవులను పూజించడం పుణ్యం. దీంతో పాటు వనభోజనాలకు వెళ్లడం కూడా పుణ్య ఫలం ఇస్తుంది. ఏటా కార్తీక మాసంలో వన భోజనాలు ఏర్పాటు చేసి భక్తులు దేవతామూర్తులను పూజిస్తారు.

– అయినవోలు రాధాకృష్ణ శర్మ, శ్వేతార్క ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు

రేపు గోకుల్ సదర్ సమ్మేళనం

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొలిసారి నిర్వహణ
- అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు జి.రాజయ్య యాదవ్



మాట్లాడుతున్న గిరిబోయిన రాజయ్య యాదవ్

హన్మకొండ: హనుమకొండలో ఈ నెల 6న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో గోకుల్ సదర్ సమ్మేళన్ నిర్వహించనున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గిరిబోయిన రాజయ్య యాదవ్ చెప్పారు. సోమవారం హనుమకొండ గోకుల్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఏటా సదర్ జరుపుకుంటారని, ఉమ్మడి వరంగల్ జిల్లాలో సదర్ సమ్మేళన్ నిర్వహించడం ఇది తొలిసారి అన్నారు. హనుమకొండలోని ఆర్టీసీ హనుమకొండ డిపో ఎదుట సదర్ సమ్మేళన్ నిర్వహించనున్నట్లు వివరించారు. సదర్ పండుగను అధికారికంగా గుర్తిస్తూ జీఓ జారీ చేసిన సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'కుడా' మాజీ చైర్మన్ సంగం రెడ్డి సుందర్‌రాజు యాదవ్, షైన్ విద్యా సంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఈ నెల 6న సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ సమ్మేళనం జరుగుతుందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని యాదవులంతా తరలివచ్చి ఈ సదర్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మహాసభ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బంక సంపత్ యాదవ్, జక్కుల రవీందర్ యాదవ్, చల్ల రాజు యాదవ్, వెంకన్న యాదవ్, బొంగు రాజు, బంక సతీశ్, ఎల్లావుల సతీశ్, బొల్లు సత్యం, బుట్టి శ్యాం యాదవ్, రాజేందర్ యాదవ్, సిద్ది రాజ్, వేల్పుల భిక్షపతి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభం



విలువిద్య పోటీలు ప్రారంభిస్తున్న ఎస్‌జీఎఫ్ అధికారులు

నెల్లికుదురు : 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలబాలికల అండర్–14, 17 విభాగంలో విలువిద్య, కత్తిసాము క్రీడాపోటీలు ప్రారంభమైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.సత్యనారాయణ తెలిపారు. నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం ఆర్చరీ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి 600 మంది బాలబాలికలు పాల్గొంటారన్నారు. 100 మంది అధికారులు, టెక్నీషియన్ల ఆధ్వర్యంలో ఈ క్రీడలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, హెచ్‌ఎంలు రవి, జీవన్ కుమార్, పీఈటీ అయిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

కన్న బిడ్డపై కన్నేసిన కామాంధుడు..

- కూతురిని పెళ్లి చేసుకుంటానని వేధింపులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లి

రఘునాథపల్లి: కన్న బిడ్డపై ఆ తండ్రి కన్నేశాడు. కూతురిని పెళ్లి చేసుకుంటానని ఒత్తిడి చేయడంతో ఆ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలానికి చెందిన ఓ మహిళ జిల్లా కేంద్రానికి చెందిన రాజేందర్ అనే వ్యక్తితో 2007 నుంచి ప్రేమ పేరుతో సహజీవనం చేస్తోంది. అయితే ఆ తర్వాత ఇద్దరికి గొడవలు జరగడంతో కొంతకాలంగా దూరంగా ఉన్నారు. 2009లో మరో వ్యక్తితో పెళ్లి జరగ్గా.. వివాహానికి ముందే ఓ వ్యక్తితో సహజీవనం చేసిన విషయం తెలుసుకున్న అతడు మూడు రోజుల్లో ఆమెను వదిలేశాడు. దీంతో మళ్లీ రాజేందర్‌తో కలిసి జీవిస్తోంది. రాజేందర్‌కు అప్పటికే వివాహం కావడంతో సదరు మహిళను హైదరాబాద్‌లో ఉంచి సహజీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు జన్మించారు. అయితే రాజేందర్ ఆ మహిళతో సహజీవనం చేస్తూ ఆమె పెద్ద కూతురు(8వ తరగతి)పై కన్నేశాడు. కొన్ని రోజులుగా పెళ్లి చేసుకుంటానని ఒత్తిడి చేస్తుండడంతో గత నెల 28న బాలిక తల్లి రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్‌లో రాజేందర్‌పై ఫిర్యాదు చేసింది. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లోనూ గతంలో రాజేందర్‌పై ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు పేర్కొంది. ఈ విషయమై ఎస్సై నరేశ్‌ను వివరణ కోరగా మహిళ ఫిర్యాదు మేరకు రాజేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రంగారెడ్డిదే ట్రోఫీ..

- బాలబాలికల విభాగంలో ప్రథమ స్థానం సాధించిన జట్టు
- ద్వితీయ స్థానంలో హైదరాబాద్..
- ముగిసిన రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు



రంగారెడ్డి బాలికల జట్టుకు బహుమతి అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ చెన్నయ్య

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ (అండర్ –17 విభాగం బాలబాలికల) పోటీలు సోమవారం ముగిశాయి. బాలికల సెమీఫైనల్‌లో ఖమ్మంపై (15) రంగారెడ్డి (23)విజయం సాధించగా, నిజామాబాద్‌పై (22) హైదరాబాద్ (25) విజయం సాధించింది. ఫైనల్‌లో హైదరాబాద్‌పై(05) రంగారెడ్డి (19) విజయం సాధించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ద్వితీయస్థానంలో హైదరాబాద్ నిలిచింది. అదే విధంగా బాలుర సెమీఫైనల్‌లో ఖమ్మంపై(21) రంగారెడ్డి (35) విజయం సాధించగా, నిజామాబాద్‌పై(21) హైదరాబాద్ (23) విజయం సాధించింది. ఫైనల్‌లో హైదరాబాద్‌పై(08) రంగారెడ్డి (18) విజయం సాధించి ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో హైదరాబాద్ నిలిచింది. కాగా, తృతీయస్థానాల్లో నిజామాబాద్ జిల్లా బాల,బాలికల జట్లు, ఖమ్మం జిల్లా బాల,బాలికల జట్లు నిలిచాయి. మహబూబాబాద్ అడిషనల్ ఎస్పీ చెన్నయ్య విజేతలకు మెడల్స్, షీల్డ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ లక్ష్యం ఎంచుకుని ముందుకు సాగాలని, అప్పుడే భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడలతోపాటు చదువులో రాణిస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవ రెడ్డి, రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్‌రాజు, డీవైఎస్‌ఓ జ్యోతి, ధన్నసరి సొసైటీ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వరరావు, హెచ్‌ఎం రాజు, బి. నరేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రావుల మురళి, పీడీలు కొమ్ము రాజేందర్, కొప్పుల శంకర్ పాల్గొన్నారు.

అట్టహాసంగా అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు

- మొదటి రోజు ఖమ్మం, ఆదిలాబాద్ జట్ల విజయం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్, మెదక్ జిల్లాల కేంద్రంగా మూడు రోజుల పాటు జరగనున్న అండర్–23 లీగ్ కమ్ నాకౌట్ అంతర్‌జిల్లాల స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం హనుమకొండలోని రెడ్డిపురం టీవీవీఎస్ మైదానంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. మొబైల్, ఇతర వ్యసనాలకు దూరంగా ఉంటూ పట్టుదల, క్రమశిక్షణతో క్రీడల్లో సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో వరంగల్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్‌గౌడ్, వరంగల్ రంజీ క్రీడాకారుడు తోట సుఖాంత్ పాల్గొన్నారు.

మొదటి రోజు..

మొదటి రోజు వరంగల్, ఖమ్మం జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచి వరంగల్ బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 50ఓవర్లకు గానూ 35.1 ఓవర్లు ఎదుర్కొని 113 పరుగుల వద్ద అన్నీ వికెట్లు కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్ బరిలోకి దిగిన ఖమ్మం జట్టు కేవలం 20.1 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 114 పరుగులు సాధించి 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

మొగిలిచర్ల క్రీడా మైదానంలో జరిగిన రెండో మ్యాచ్‌లో మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లకు గానూ 47.1 ఓవర్లు ఎదుర్కొని 191 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. అనంతరం బరిలోకి దిగిన ఆదిలాబాద్ జట్టు 39.2 ఓవర్లను ఎదుర్కొని 7 వికెట్ల నష్టానికి 192 పరుగులు సాధించి 3 వికెట్ల తేడాతో గెలుపొందింది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



శ్రీశైలం మృతదేహం

వేలేరు : అప్పుల బాధతో ఓ రైతు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని ఎర్రబెల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై అజ్మీరా సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బెల్లం శ్రీశైలం (55)కు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నాలుగేళ్లుగా వరి, పత్తి పంటలు సాగు చేశాడు. పంటలు సరిగా పండక సుమారు రూ.10 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పుల బాధలు తట్టుకోలేక ఇటీవలే ఎకరం భూమి విక్రయించాడు. అప్పుల బాధకు తోడు ఇంట్లో ఆర్థిక సమస్యలు ఉండడంతో పలుమార్లు మనస్తాపానికి గురయ్యేవాడు. సోమవారం ఉదయం బావివద్ద పని ఉందని చెప్పి వెళ్లాడు. వీరి బావి పక్కన ఉన్న వ్యక్తి.. శ్రీశైలం కుమారుడికి ఫోన్‌చేసి మీనాన్న కొట్టంలో తాడుతో ఉరేసుకుని ఉన్నట్లు విషయం చెప్పాడు. భార్య, కొడుకు బావి వద్దకు వెళ్లే సరికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి రిటైర్డ్ రైల్వే ఉద్యోగి..

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ పరిధిలో సోమవారం రిటైర్డ్ రైల్వే ఉద్యోగి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాజీపేట జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి కథనం ప్రకారం.. కాజీపేట రహమత్‌నగర్‌కు చెందిన కొరివి కృష్ణారావు(75) రైల్వేలో ఉద్యోగం చేసి రిటైర్డ్ అయ్యాడు. కాజీపేట జంక్షన్ పరిధిలోని కిలోమీటర్ నంబర్ 324/23–21, గూడ్స్‌లైన్–1 సికింద్రాబాద్ వైపు రూట్‌లో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీ గదికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

నవోదయ విద్యాలయంలో క్లర్క్..

మామునూరు: అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, అప్పులతో మనస్తాపానికి గురైన నవోదయ క్లర్క్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం మామునూరు జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణంలో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. ఖిలావరంగల్ మండలం మామునూరు జవహర్ నవోదయ విద్యాలయంలో ఎండీ వసీమ్ హైమద్(45) కార్యాలయ క్లర్క్‌గా పని చేస్తున్నాడు. కుటుంబంతో కలిసి నవోదయ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. హైమద్ కొంత కాలం అనారోగ్యానికి గురయ్యాడు. చేసిన అప్పులు తీర్చలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. మనస్తాపానికి గురైన ఎండీ. వసీమ్ హైమద్ సోమవారం ఉదయం విధులకు హాజరుకాకుండా క్వార్టర్స్‌లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనా స్థలానికి మామునూరు ఎస్సై కృష్ణవేణి హుటాహుటిన చేరుకున్నారు. మృతికి గల కారణాలను సేకరించారు. మృతుడి కుమారుడు ఎండీ. ఇమ్రాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్



కోడి పందెం ఆటగాళ్ల అరెస్ట్ చూపుతున్న ఎస్సై రవికుమార్

నర్సంపేట రూరల్ : కోడి పందెం రాయుళ్లను అరెస్ట్ చేసి రూ.14,160 నగదు, మూడు పుంజులు, 35 చిన్న కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు నర్సంపేట టౌన్ ఎస్సై రవికుమార్ తెలిపారు. నర్సంపేట పట్టణంలోని మాదన్నపేట రోడ్డులో కోడి పందేలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఇందులో మూడు పుంజులు, రూ.14,160 నగదు, 7 సెల్‌ఫోన్లు, కొడవలి, 35 చిన్న కత్తులు స్వాధీనం చేసుకుని ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అరెస్ట్ చేసిన వారిలో బొల్లు వెంకట్, జగన్నాథం రాజు, నూనె కుమారస్వామి, ఘంటశాల నాగరాజు, తాడం సమ్మయ్య, బోడ వీరన్న, భూక్య సురేశ్ ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

పరిహారం కోసం రైతు ఆందోళన

- నల్లబెల్లిలో ఉద్రిక్తత



ఆందోళన చేస్తున్న రైతులు

నల్లబెల్లి : నకిలీ పురుగుల మందు మిరపతోటకు పిచికారీ చేయడంతో చేతికందిన మిరపతోట ఎండిపోయిందని, తనకు నష్టపరిహారం అందించాలని కోరుతూ మండల కేంద్రంలోని మహ్మద్ ఖాజామైనొద్దీన్ ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాపు ఎదుట రైతు సోమవారం ఆందోళన చేశాడు. పరిహారం అందించి ఆదుకోవాలని షాపు యజమాని హైమద్ కాళ్లపైపడి వేడుకున్నా కనికరించకపోవడంతో ఎండిపోయిన పంటను చేతపట్టుకుని షాపు ఎదుట బైఠాయించడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకున్నాయి. నల్లబెల్లి, దుగ్గొండి మండలాలకు చెందిన రైతులు రైతుకు మద్దతుగా నిలుస్తూ ఆందోళనలో పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రశాంత్ బాబు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో, షాపు యజమానితో చర్చించారు. రైతుకు న్యాయం చేస్తానని భరోసా కల్పించి ఆందోళన విరమింపజేశారు. ఇరువురిని నర్సంపేట రూరల్ సీఐ సాయి రమణ వద్దకు పంపించారు.

బాధిత రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ముగ్ధం యుగేందర్ తనకున్న భూమిలో రెండు ఎకరాల మిరపతోట సాగు చేశాడు. తోటలో పూత, కాత పెంపుదల రావాలని నల్లబెల్లిలోని మహ్మద్ ఖాజామైనొద్దీన్ ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాపులో ఇటీవల పురుగుల మందు కొనుగోలు చేసి పిచికారీ చేశాడు. పిచికారీ చేసిన నాలుగు రోజుల్లో మిరపతోట ఎండిపోయిందని వాపోయాడు. ఈ విషయంపై షాపు యజమాని దగ్గరకు వెళ్లి మీరు చెప్పిన విధంగానే మందులను పిచికారీ చేయగా ఎలాంటి ఫలితం లేదన్నాడు. కంపెనీ ప్రతినిధులను చర్చించి న్యాయం చేస్తామని షాపు యజమాని భరోసా కల్పించాడు. ఇలా రెండు వారాలుగా దాట వేస్తున్నాడని బాధితుడు ఆరోపించారు. పరిహారం అందించి తనకు న్యాయం చేయాలని కోరుతూ షాపు యజమాని హైమద్ కాళ్లపై పడి వేడుకున్నా కనికరించలేదని మండిపడ్డాడు, ఇప్పటికైనా తనకు నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

వర్గీకరణ అమలు చేస్తాం..

- కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడితే చర్యలు
- ఏఐసీసీ కార్యదర్శి సంపత్



అభివాదం చేస్తున్న నాయకులు

హసన్‌పర్తి: సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ అన్నారు. సోమవారం చింతగట్టు క్యాంపు సమీపంలోని కేఎల్ఎన్ గార్డెన్‌లో మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కాంగ్రెస్ వర్ధన్నపేట కోఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈసమావేశానికి సంపత్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని ఒత్తిళ్ల కారణంగా వర్గీకరణ అమలుపై జాప్యం జరుగుతోందన్నారు. వర్గీకరణ అమలు చేయడానికి కార్యాచరణతో ముందుకుసాగుతున్నట్లు చెప్పారు. రేవంత్‌రెడ్డిపై తమకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ వర్గీకరణపై సానుకూలంగా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని మేనిఫెస్టోలో కూడా పొందపరిచిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడితే చర్యలు తప్పవన్నారు. ఈ విషయమై టీపీసీసీ అధ్యక్షుడికి ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలుపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారన్నారు. అయితే సాంకేతిక సమస్యలు రాకుండా కమిషన్ వేసినట్లు చెప్పారు. నివేదిక వచ్చిన వెంటనే అమలు చేస్తామని తెలిపారు. నకిరేకల్, మానకొండూరు, ధర్మపురి ఎమ్మెల్యేలు వేముల వీరేశం, సత్యనారాయణ, లక్ష్మణ్, వరంగల్ ఎంపీ కడియం కావ్య, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, తాటికొండ రాజయ్య, కొండేటి శ్రీధర్ మాట్లాడారు. కొంతమంది వ్యక్తులు మాదిగలను కించపరిచినట్లు మాట్లాడుతున్నారని, వారు తమ పద్ధతులు మార్చుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ కాసీం, ప్రొఫెసర్ ముత్తయ్య.. ఎస్సీ వర్గీకరణ అంశంపై వివరించారు.

వర్గీకరణను వ్యతిరేకించే ఎమ్మెల్యేలకు బుద్ధిచెప్పాలి..

వర్గీకరణను వ్యతిరేకించే ఎమ్మెల్యేలకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, కెఆర్. నాగరాజు పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవరిస్తున్నారని, వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. జెడ్పీ మాజీ చైర్మన్ సుధీర్‌కుమార్, రిటైర్డ్ రైల్వే అధికారి భరత్ భూషణ్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు పుట్ట రవిమాదిగ, మందకుమార్‌మాదిగ, బొట్ల భిక్షపతి, దేవరకొండ అనిల్, రాజారపు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.